

వైభవంగా కొండచుట్టు..

సంక్రాంతి సంబరాల్లో భాగంగా మూలస్థాన ఎల్లమ్మ కొండ చుట్టు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

- 10లో



కాలుదువ్విన కోడెగిత్తలు

చంద్రగిరి మండలం మల్లయ్యపల్లెలో బుధవారం నిర్వహించిన పరుష పందేలకు జనం పోటెత్తారు.

- 10లో



మోదీ పాలనలో మరింత అభివృద్ధి

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశం మరింత అభివృద్ధి చెందిందని కేంద్ర సహాయ మంత్రి తెలిపారు.

- 10లో

గురువారం । 18 । జనవరి । 2024

న్యూస్‌రీల్

రేపటి నుంచి 'కుల గణన'



వెంకటరమణారెడ్డి, కలెక్టర్

తిరుపతి అర్బన్ : జిల్లా వ్యాప్తంగా 19 నుంచి 28వ తేదీ వరకు కుల గణన సర్వే చేపట్టనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 34 మండలాల్లో కుల గణన నిర్వహించేందుకు ఇప్పటికే 15 బృందాలకు శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. అలాగే గత ఏడాది నవంబర్‌లో కుల గణనకు సంబంధించి పలు కులాల పెద్దలకు అవగాహన కల్పించామన్నారు. జిల్లాలోని మొత్తం 1,051 రెవెన్యూ గ్రామాలకు చెందిన 691 సచివాలయాల పరిధిలోని సిబ్బందితో ఇంటింటా సర్వే చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. కులాల వారీగా జనాభా, సామాజిక విద్య, ఆర్థిక పురోగతి సమాచారాన్ని నమోదు చేయనున్నట్లు తెలిపారు. అర్హత ఉండి సంక్షేమ పథకం అందకుంటే వారి వివరాలను కూడా పేర్కొననున్నట్లు చెప్పారు. రోజువారీ గణన రూట్‌మ్యాప్‌ను ఆయా సచివాలయం వద్ద నోటీస్ బోర్డులో ప్రచురించనున్నట్లు వెల్లడించారు. కులగణనకు సంబంధించి ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. వంద శాతం పారదర్శకతతో సర్వే ఉంటుందన్నారు. సాంకేతిక సమస్యల పరిష్కారం, సందేహాలు నివృత్తి కోసం జిల్లా స్థాయి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రజలు సహకరించాలని కోరారు.

కాటమరాజులకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : తుమ్మలగుంటలో కాటమరాజులకు బుధవారం పొంగళ్లు పొంగించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆచారం ప్రకారం ముళ్లకంపలను కుప్పగా వేసి నిప్పు పెట్టారు. తుమ్మలగుంట చెరువు కట్ట వద్ద ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. స్థానిక మహిళలు అందించిన ప్రసాదాలను స్వీకరించారు. ప్రజల శ్రేయస్సు కోసం గ్రామ దేవతలకు పూజలు చేయడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే చెవిరెడ్డి తెలిపారు.

అంబేడ్కర్ ఆశయాల మేరకే పాలన



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీ, కలెక్టర్

తిరుపతి కల్చరల్ : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో నేడు పరిపాలన సాగుతోందని ఎంపీ గురుమూర్తి తెలిపారు. బుధవారం తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, కమిషనర్ హరితతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నగరవాసులతో కలిసి మానవహారంగా ఏర్పడ్డారు. ఎంపీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా విజయవాడ నడిబొడ్డున 206 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, వారి కుటుంబాలలో ఆర్థిక స్థిరత్వం, సమానత్వం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ అంబేడ్కర్ భావజాలాన్ని ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని తెలిపారు. విజయవాడలోని స్వరాజ్ మైదాన్‌లో సుమారు రూ.400 కోట్లు వెచ్చించి, 20 ఎకరాల్లో అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చేశారన్నారు. ఈ నెల 19వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా స్మృతివనాన్ని జాతికి అంకితం చేస్తున్నారని వెల్లడించారు. ప్రతి సచివాలయం నుంచి ఐదుగురిని విజయవాడలో నిర్వహించే అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు పంపించేందుకు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, బీసీ వెల్ఫేర్ అధికారి భాస్కర్‌రెడ్డి, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆనందం పరవళ్లు

కృష్ణాజలాల పరవళ్లతో కుప్పం నియోజకవర్గం పులకిస్తోంది.. దశాబ్దాల కల నెరవేరినందుకు రైతాంగం సంబరపడుతోంది.. బంజరు భూమిలో సైతం ఇక బంగారం పండనుంది.. నెర్రెలు బారిన నేల సస్యశ్యామలం కానుంది.. ఏళ్ల తరబడి చంద్రబాబు బూటకపు హామీలతో కుంగిపోయిన ప్రజానీకం కృష్ణమ్మ రాకతో హర్షాతిరేకం వ్యక్తం చేస్తోంది. ఇచ్చిన మాట చెల్లించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు తెలియజేస్తోంది.. హంద్రీ–నీవా కాలువ ద్వారా నీటి కష్టాలు తీర్చినందుకు కృతజ్ఞతలు చెబుతోంది.

- కుప్పం చేరిన కృష్ణా జలాలు
- సంబరంగా స్వాగతం పలికిన ప్రజలు
- సస్యశ్యామలంగా మారనున్న కరువు ప్రాంతం
- హామీ నెరవేర్చిన ముఖ్యమంత్రికి రైతుల కృతజ్ఞతలు



కుప్పం నియోజకవర్గంలోకి ప్రవేశిస్తున్న కృష్ణా జలాలు (ఇన్‌సెట్) స్వాగతం పలికిన అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్, పక్కన ఎంపీ రెడ్డెప్ప



కుప్పం : హంద్రీ–నీవా సుజల స్రవంతిలో భాగంగా జిల్లాలోని పడమటి మండలాలకు తాగు.. సాగు నీటిని అందించాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సంకల్పించారు. ఈ మేరకు 2006లో తలపెట్టిన పాలారు ప్రాజెక్టుకు తమిళనాడులోని రాజకీయపార్టీలతో కలిసి చంద్రబాబు మోకాలడ్డారు. అయినప్పటికీ కుప్పానికి కృష్ణా జలాలు తీసుకురావాలని వైఎస్సార్ హంద్రీ–నీవా కాలువ పనులకు శ్రీకారం చుట్టారు. శ్రీశైలం నుంచి కుప్పం వరకు చేపట్టిన కాలువ పనులు ఆయన మరణంతో అర్ధాంతరంగా ఆగిపోయాయి. అనంతరం 2014 అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తూతూ మంత్రంగా పనులు చేపట్టారు. 2019 ఎన్నికల సమయంలో బోర్ల ద్వారా నీరు పంపింగ్ చేయించి జల హారతులు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టారు. అయితే బాబు మోసాలను కుప్పం వాసులు కొద్దిరోజులకే కనిపెట్టారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా, సుమారు 35 ఏళ్ల పాటు కుప్పం ఎమ్మెల్యేగా పనిచేసినా చంద్రబాబు తమకు చేసింది శూన్యమని గ్రహించారు. అందుకే తర్వాత వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీని అథఃపాతాళానికి తొక్కేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సైతం బాబుని తిరస్కరించేందుకు సిద్ధంగా ఉన్నారు.

ఇచ్చిన హామీ మేరకు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్ష నేత నియోజకవర్గమైనా కుప్పంపై ఏనాడూ వివక్ష చూపలేదు. రూ.వందల కోట్లు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ క్రమంలోనే గత ఏడాది సెప్టెంబర్‌లో కుప్పం ప్రజల దశాబ్దాల కలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. హంద్రీ–నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను తీసుకువచ్చి తాగు..సాగు నీరు అందిస్తామని స్పష్టం చేశారు. ఆ మేరకు కాలువ పనులు పరుగులు తీయించారు. స్థానికుల స్వప్నం సాకారం చేస్తూ బుధవారం హంద్రీ–నీవా కాలువ ద్వారా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ కుప్పం నియోజకవర్గానికి చేరింది. దీంతో ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇచ్చిన హామీ నెరవేర్చిన ముఖ్యమంత్రిపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

మారనున్న బతుకులు

మారుమూల ప్రాంతమైనా కుప్పం నియోజకవర్గంలో ప్రజానీకం అధికంగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గతంలో కరువు కాటకాల కారణంగా ఎక్కువ మంది వలస బాట పట్టారు. కుప్పం నుంచి బెంగళూరుకు వెళ్లి కూలి పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నారు. ప్రస్తుతం కృష్ణా జలాల రాకతో ఇక్కడి ప్రజల జీవన స్థితిగతుల్లో గణనీయమైన మార్పు రానుంది. వలస బతుకులకు జీవనాధారం ఏర్పడనుంది. వ్యవసాయం, పాడి పరిశ్రమపై దృష్టి పెట్టే వెసులుబాటు వచ్చింది. ఇప్పటికే గత నాలుగున్నరేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో చాలా మంది పాడి, వ్యవసాయం వైపు మొగ్గు చూపారు. ఇప్పుడు కృష్ణా జలాలు కూడా రావడంతో నీటి కష్టాలు పూర్తిగా తీరినట్టే అని కుప్పం వాసులు ఆనందిస్తున్నారు. ఎక్కడికీ వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంత ఊర్లో సగౌరవంగా జీవనం సాగించవచ్చని వెల్లడిస్తున్నారు. కరువు ప్రాంతం త్వరలోనే పచ్చదనంతో సస్యశ్యామలంగా మారుతుందని సంతోషంగా చెబుతున్నారు.

చరిత్రలో నిలిచి పోతారు



ఎన్నో ఏళ్లుగా హంద్రీ–నీవా కాలువ ద్వారా నీరు వస్తుందని ఎదురుచూస్తున్నాం. ఇన్నాళ్లకు మా కల నెరవేరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు. మేం ఏళ్ల తరబడి మోసిన చంద్రబాబు మా నెత్తిన ఎప్పుడూ కుచ్చుటోపీ పెట్టేవారు. ఇప్పటి వరకు ఈ విధంగా చెప్పిన మాట నిలబెట్టుకున్న నాయకుడిని చూడలేదు.

– వెంకటేష్, యమునాసనపల్లె

రుణం తీర్చుకోలేం



కృష్ణా జలాలతో మాకు నీరందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రుణం ఎప్పటికీ తీర్చుకోలేం. తండ్రికి తగ్గ తనయుడిగా మాట నిలబెట్టుకున్నారు. బోర్లు, బావులు ఎండిపోయి వ్యవసాయం చేయలేక నానా అవస్థలు పడేవాళ్లం. ఇప్పుడు మా కష్టాలు గట్టెక్కాయి. గతంలో నేతలు మమ్మల్ని ఓటర్లగానే చూసేవారు. జగనన్నే మమ్మల్ని మనుషులుగా చూస్తున్నారు.

– మల్లప్ప, సలార్లపల్లె

కరువు తీరింది



హంద్రీ–నీవా కాలువ ద్వారా కృష్ణాజలాలు కుప్పం రావడంతో మా కరువు తీరింది. ఇది వరకు నీటి కోసం మైళ్ల దూరం నడచి వెళ్లి తెచ్చుకునేవాళ్లం. నీటి కష్టాలు తీర్చాలని దశాబ్దాలుగా పోరాడుతున్నాం. ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నిసార్లు గెలిపించినా చంద్రబాబు మమ్మల్ని ఎప్పుడూ మోసమే చేసేవారు. ఇన్నాళ్లకు మా ఇక్కట్లు తీర్చిన అపర భగీరథుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఆయన మేలు మరువలేం.

– నారాయణప్ప, నలగంపల్లె

కల సాకారం



హంద్రీ–నీవా కాలువ నుంచి నీరు కుప్పానికి రావడంతో ఆనందం పట్టలేకున్నాం. వ్యవసాయం ఆపేసి ప్రస్తుతం అక్కడా ఇక్కడా కూలి పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నాం. ఇకపై మాకు ఆ కష్టాలు ఉండవు. మా భూమిలో పంటలు సాగు చేసుకుని గౌరవంగా బతుకుతాం. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చలువే. మా కల సాకారం చేశారు.

– కృష్ణప్ప, శెట్టిపల్లె

గిరిచుట్టులో దేవతల సందడి



కొండచుట్టు మండపంలో వినాయకుని దర్శించుకున్న మంత్రి రోజా



దేవతల సందింపు కార్యక్రమంలో

- ఊరేగింపుగా వచ్చిన గ్రామ దేవతలు
- దేదీప్యమానంగా దేవతల సందింపు

నగరి : పట్టణంలో కొండచుట్టు ఉత్సవం అంగరంగ వైభవంగా సాగింది. కొండచుట్టు మండపం వద్ద బుధవారం ఉదయం నుంచే హడావుడి మొదలైంది. పరిసర గ్రామాల నుంచి వచ్చే దేవతలకు స్వాగతం పలికేందుకు ముందుగా వెళ్లాల్సిన కరకంఠేశ్వర స్వామికి అభిషేక అర్చనలు చేసి అలంకరించారు. సాయంత్రం కొండచుట్టు మండపం వద్దకు తీసుకువెళ్లారు. స్వామి ఆహ్వానం మేరకు పాళమంగళం నుంచి పాళేశ్వర స్వామి, ముడిపల్లి అగస్తీశ్వర స్వామి, కరింబేడు నాథాళీశ్వర స్వామి, మేళంబాకం రాధాకృష్ణస్వామి, మిట్టపాళెం పాళేశ్వర స్వామి, దేశూరు అగరం నుంచి వేణుగోపాలస్వామి, కృష్ణారాపురం గ్రామం నుంచి శివపార్వతులు, తెరణి వైకుంఠనాథ స్వామి, సత్రవాడ నుంచి చిదంబరేశ్వర స్వామి, శివగామి సుందరి, చింతలపట్టెడ శరవణవినాయక, అగరవినాయక స్వాములు, మేళపట్టు ఈశ్వరస్వామి, ఎలకాటూరు కృష్ణమూర్తి స్వామి, ముడిపల్లి అగస్తీశ్వర స్వామి, రాధారుక్మిణి స్వాములు, చవరంబాకం పరమేశ్వరస్వామి, కళియంబాకం కాశీశ్వర స్వామి, జ్ఞానమ్మ పట్టెడ నుంచి మీనాక్షి దేవి, మూలనెత్తం గ్రామం నుంచి ఈశ్వరుడు, వినాయకుడు కొండచుట్టు మండపానికి విచ్చేశారు. ఊరేగింపుగా విచ్చేసిన దేవతలకు గ్రామస్తులు దారి పొడవునా రంగవల్లికలతో స్వాగతించారు. వివిధ గ్రామాల నుంచి ట్రాక్టర్లపై వచ్చిన ఉత్సవమూర్తులకు కరకంఠేశ్వర స్వామి ఎదురెళ్లి స్వాగతం పలుకగా కొండచుట్టు మండపం వద్దకు చేరి విఘ్నేశ్వరుని దర్శించుకొని సమీప మైదానంలో కొలువుదీరారు. రాత్రి ఉత్సవ విగ్రహాలు కొలువు దీరగా ఆ కమనీయ దృశ్యాన్ని తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దేవతల తరఫున అర్చకులకు కరకంఠేశ్వర స్వామి ఆలయ అర్చకులు పరివట్టం కట్టి మర్యాదలు చేసి వీడ్కోలు పలికారు. ఏక కాలంలో అందరు దేవతలు ఒక్కచోటకు చేరడం అందరికీ ఒక్కసారిగా హారతి ఇవ్వడం ప్రత్యేకత సంతరించుకుంది. కొండచుట్టు మండపం వద్ద గురువారం వేకువజాము నుంచే తిరనాళ్ల సందడి నెలకొంది. పరిసరాల్లో తినుబండారాల విక్రయదారులు, బొమ్మలు, గాజులు, బొరుగులు, చెరకు గడలు విక్రయించేవారు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి ప్రజలు నడక సాగించడంలో కొండచుట్టుకు వెళ్లే మార్గం కిక్కిరిసిపోయింది. సుమారు కిలోమీటరు మేర జనసందోహం కనిపించింది. యువకులు గుంపులు గుంపులుగా మిత్రులతోను, పెద్దలు వారి వారి కుటుంబ సభ్యులతోను నడక సాగించారు. నగరి పట్టణం వదిలి ఇతర ప్రాంతాలలో స్థిరపడిన వారు కూడా కొండచుట్టు ఉత్సవాలకు హాజరయ్యారు. రాత్రి దీప కాంతులతో కొండచుట్టు మండపం శోభాయమానంగా కనిపించింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. మంత్రి ఆర్కేరోజా పార్టీ శ్రేణులతో కలిసి ఊరేగింపుగా విచ్చేసిన దేవతలను దర్శించుకున్నారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆధునికీకరణ



అమ్మవారి సేవలో టీటీడీ చైర్మన్ భూమన

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలని టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆదేశించారు. బుధవారం గంగమ్మ ఆలయంలోపనులను ఆయన పరిశీలించారు. నాణ్యతాప్రమాణాల మేరకే నిర్మాణాలు చేపట్టి త్వరితగతిన భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ శిరీష, వైఎస్సార్‌సీపీ నేతలు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'హెల్తీ విలేజ్ వర్క్‌షాప్'



స్వాగత తోరణం



వేదికను పరిశీలిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ తదితరులు

- నేటి నుంచి మూడు రోజులపాటు చర్చలు.. పరిశీలన
- దేశవ్యాప్తంగా 250 మంది ప్రముఖుల హాజరు
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు

తిరుపతి అర్బన్ : తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో గురువారం నుంచి హెల్తీ విలేజ్ పేరిట జాతీయస్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు కొనసాగనున్న వర్క్‌షాప్‌నకు దేశంలోని మొత్తం 29 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 250 మంది ప్రముఖులు, ఏపీలో వివిధ శాఖలకు చెందిన 350 మంది అధికారులు హాజరవుతున్నారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ శుభం బన్సల్ ఆధ్వర్యంలో ఇప్పటికే పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ప్రతిష్టాత్మక వర్క్‌షాప్‌ను ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ నేతృత్వంలో రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ పర్యవేక్షణలో వర్క్‌షాప్ సాగనుంది. ఈ సందర్భంగా ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లో అందిస్తున్న వైద్యసేవలపై ప్రతినిధులు కూలంకషంగా చర్చించనున్నారు. క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి మరింత మెరుగైన సేవలు అందించేందుకు సలహాలు, సూచనలు అందించనున్నారు.

కార్యక్రమాలు ఇలా..

- 18వ తేదీన జాతీయస్థాయి వర్క్‌షాప్ ప్రారంభిస్తారు. మధ్యాహ్నం ఆయా రాష్ట్రాల ప్రతినిధులు తమ స్టేట్‌లోని పల్లెల్లో అమలు చేస్తున్న వైద్యసేవలను వివరిస్తారు.
- 19వ తేదీన వైద్యసేవలపై చర్చలు సాగిస్తారు. ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధి విధానాలను తెలియజేస్తారు. మెరుగైన వైద్యం అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తారు.
- 20వ తేదీన తిరుపతి సమీప ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో అన్ని రాష్ట్రాల ప్రతినిధులు పర్యటిస్తారు. క్షేత్రస్థాయిలో వైద్యసేవలను పరిశీలిస్తారు. ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పనితీరు, గర్భిణులు, బాలింతలు పొందుతున్న సేవలను నిశితంగా అధ్యయనం చేస్తారు.

ఏర్పాట్ల పరిశీలన

వర్క్‌షాప్ ఏర్పాట్లను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, కమిషనర్ సూర్యకుమారి, స్పెషల్ కమిషనర్ సిరి పరిశీలించారు.

22న వర్క్‌షాప్

చిత్తూరు కలెక్టరేట్ : సర్కారు బడులను గ్రీన్ స్కూల్స్‌గా తీర్చిదిద్దేందుకు ఈ నెల 22న ఎంపిక చేసిన పాఠశాలల హెచ్‌ఎం, సబ్జెక్ట్ టీచర్లకు రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయానికి రాష్ట్ర సమగ్రశిక్ష శాఖ ఎస్పీడీ జారీచేసిన ఉత్తర్వులు అందాయి. ఆ ఉత్తర్వుల మేరకు చిత్తూరు, తిరుపతి జిల్లాలోని పలు పాఠశాలల హెచ్‌ఎంలను ఎంపిక చేశారు. చిత్తూరు జిల్లాలోని వి.కోట మండలం ముదరందొడ్డి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బాలచైతన్య, తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి జెడ్పీ హైస్కూల్ లో పనిచేస్తున్న నీలకంఠయ్య(గ్రీన్ స్కూల్స్ రాష్ట్ర కో ఆర్డినేటర్), వడమాలపేట మండలం జెడ్పీ పత్తిపుత్తూరు హైస్కూల్‌లో పనిచేస్తున్న హరిశంకర్ ఒకరోజు వర్క్‌షాప్‌కు హాజరుకావాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల 'స్వచ్ఛ' సేవ


సేకరించిన చెత్తకు నిప్పు పెడుతున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు

రేణిగుంట : మండలంలోని డీపీ కండ్రిగకు చెందిన పలువురు యువకులు చెన్నై, బెంగళూరు తదితర నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. సంక్రాంతి పండుగకు స్వగ్రామానికి వచ్చారు. సంబరాలు చేసుకుని వెళ్లిపోకుండా పల్లెను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు నడుం బిగించారు. ఈ మేరకు ఆర్.మల్లవరం నుంచి ఎస్‌యూ పురం మార్గంలో రోడ్డుకు ఇరువైపులా సుమారు 2 కిలోమీటర్ల మేర పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఖాళీ మద్యం సీసాలను తొలగించారు. అనంతరం సేకరించిన చెత్తను తగులబెట్టారు. ఆయా దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారాయి. ఎందరికో స్ఫూర్తినిచ్చేలా గ్రామ స్వచ్ఛతకు కృషి చేసిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు జగన్‌మోహన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జయకుమార్‌రెడ్డి, కోహిత్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డిపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ క్రమంలోనే సర్పంచ్ ఆవుల ముని వెంకట్రామిరెడ్డి(బాబ్జీ), సుబ్రమణ్యం రెడ్డి, మహదేవరెడ్డి అభినందించారు.

వైభవంగా కొండచుట్టు మహోత్సవం

- అమ్మవారికి పట్టువస్త్రాలను అందజేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు


జనసంద్రం నడుమ కొండచుట్టు మహోత్సవానికి బయలుదేరిన మూలస్థాన ఎల్లమ్మ


ద్రౌపదీ సమేతంగా ధర్మరాజస్వామి వారు

చంద్రగిరి: సంక్రాంతి మహోత్సవాల్లో భాగంగా చంద్రగిరి గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మతల్లి కొండచుట్టు మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి కొండచుట్టు ఉత్సవానికి తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున స్థానిక కోదండ రామస్వామి ఆలయం నుంచి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మి దంపతులు సారెను ఊరేగింపుగా తీసుకుని వచ్చి సమర్పించారు. వారికి ఆలయం వద్ద పాలక మండలి అధ్యక్షుడు యారాశి చంద్రశేఖర్ రెడ్డి సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేయించారు. అనంతరం ఆలయ ఈఓ తిమ్మారెడ్డి, వేదపండితులు ఆశీర్వచనం పలికి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆలయ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

మూలస్థాన ఎల్లమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. వీలైనంత త్వరగా గర్భాలయం పూర్తి చేసి, కుంబాభిషేకం జరిగేలా చూడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. భక్తులకు ఆటంకం కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని చెప్పారు. పనులు ఏ మాత్రం ఆలస్యం కాకుండా సకాలంలో పూర్తి చేయాలని, ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలని అక్కడి అధికారులకు సూచించారు.

వైభవంగా కొండ చుట్టు

మూలస్థాన ఎల్లమ్మ తల్లి కొండ చుట్టు మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది. కొండచుట్టులో భాగంగా అమ్మవారు ధర్మరాజుల ఆలయం వద్దకు చేరుకోగానే అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుంచి ద్రౌపది, ధర్మరాజుల సమేత భీమ, అర్జునులతో కొండ చుట్టుకు పయనమయ్యారు. మండలంలోని అగరాల గ్రామానికి రాత్రి 9 గంటల చేరుకుని, ఆరిమేణి గంగమ్మ చెంత కొలువుదీరారు. అక్కడ పుట్టింటి సారెను అమ్మవారు స్వీకరించారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అక్కడ నుంచి అమ్మవారు ఐతేపల్లె, పులిత్తివారిపల్లె, నాగయ్యగారిపల్లె, రామిరెడ్డిపల్లె, రెడ్డివారిపల్లె మీదుగా గురువారం ఉదయం అమ్మవారు చంద్రగిరికి చేరుకున్నారు. అమ్మవారి కొండ చుట్టు సందర్భంగా ఏర్పాటు చేసిన పలు కళా ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ తిమ్మారెడ్డి, ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు చిల్లకూరి యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు


ఎమ్మెల్యే దంపతులకు హారతులు పడుతున్న మహిళలు

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 73,016 మంది స్వామివారిని దర్శించుకోగా 20,915 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.46 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి

కోట : మండలంలోని వావిళ్లదొరువులో బుధవారం ఓ వ్యక్తి చేపలు పట్టేందుకు వెళ్లి మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన వెంకటరమణయ్య (55) సమీపంలోని నున్నకాండిగుంటలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకోవడంతో మునిగిపోయాడు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసుల సమక్షంలో స్థానికులు గుంతలోకి దిగి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి కుమారుడు నగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు.

అనుమానాస్పదంగా వివాహిత ..

నాయుడుపేట : పట్టణంలోని లక్ష్మీ అనంతసాగరం కాలనీలో మంగళవారం రాత్రి అనుమానాస్పదంగా ఓ వివాహిత మృతి చెందిందని పోలీసులు బుధవారం తెలిపారు. వివరాలు.. బీహార్‌కు చెందిన హాన్సుకుమారి, ముఖేష్ కుమార్‌కు ఆరు నెలల క్రితం వివాహమైంది. నెల క్రితం ఉపాధి కోసం నాయుడుపేటకు వచ్చారు. ముఖేష్‌కు ఓ బార్బర్ షాపులో పని దొరికింది. ఎల్‌ఏ సాగరం కాలనీలో అద్దె ఇల్లు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో హాన్సుకుమారి తన ఇంట్లోనే ఉరేసుకుని ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. వారి సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక వస్తే హాన్సికుమారిది హత్యా లేక ఆత్మహత్యా నిర్ధారణ అవుతుందని డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్ట్

కేవీబీపురం : మండలంలోని అంజూరు సమీపంలో బుధవారం నిర్వహిస్తున్న కోడి పందేలపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రెండు కోళ్లు, రూ.1,720 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు. దాడిలో ఏఎస్‌ఐ లోకనాథం, కానిస్టేబుళ్లు గంగాధర్, ప్రభాకర్, దయాకర్, దాము పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


చంద్రగిరి : పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై అగరాల సమీపంలో బుధవారం జరిగి న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. చంద్రగిరి మండలం నరసింగాపురం గ్రామానికి చెందిన గంగాధరం (45) వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం ఐతేపల్లెలోని అయ్యప్ప ఆలయానికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గం మధ్యలో తిరుపతి నుంచి చిత్తూరు వైపునకు వెళుతున్న కారు వెనుక నుంచి ఢీకొంది. దీంతో గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గంగాధరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుప తి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు..

చంద్రగిరి: మండలంలోని పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిపై బుధవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు చికిత్సపొందుతూ మృతి చెందాడు. వివరాలు.. ముంగళిపట్టు ఎస్టీ కాలనీకి చెందిన రాము(21) తన స్నేహితుడు ప్రశాంత్‌తో కలసి ఉదయం ద్విచక్ర వాహనంలో చిత్తూరు వైపునకు వెళుతుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రాముకు తీవ్ర గాయాలు కాగా, ప్రశాంత్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది రామును తిరుపతి రుయాకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బాబు చూడలేదట!

- మీడియాతో మాజీ మంత్రి పరసారత్నం


మాట్లాడుతున్న మాజీ మంత్రి పరసారత్నం

తిరుపతి కల్చరల్: చంద్రబాబు మీడియా సమావేశంలో తనను అగౌరవపరచడంపై పరసారత్నమే మీడియా ముందుకు వచ్చి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. సోమవారం రాత్రి తిరుపతిలో జరిగిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రెస్‌మీట్‌లో నియోజకవర్గ స్థాయి నాయకులు వేదికపై ఆసీనులై ఉండగా మాజీ పరసారత్నం వెనుక వరుసలో నిల్చొని ఉన్నారు. దీనిపై 'దళితులకు ఇచ్చే గౌరవం ఇదేనా బాబు' అంటూ పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ వార్తలపై టీడీపీ నాయకులు ఎవరూ స్పందించలేదు. చివరకు పరసారత్నమే బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడాల్సిన దుస్థితి వచ్చింది. చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి తాను ఆలస్యంగా వచ్చానని, ఆ సమయంలో తనను బాబు చూడలేదని, చూసుంటే ముందు వరుసలో కూర్చొబెట్టే వారని సర్దిచెప్పుకోవడం కొసమెరుపు.

మోదీ పాలనలో మరింత అభివృద్ధి


గ్యాస్ సిలిండర్ నమూనా అందిస్తున్న దేవ్‌సింగ్ చౌహాన్

వాకాడు : ప్రధానమంత్రి నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో దేశం మరింత అభివృద్ధి చెందిందని కేంద్ర కమ్యూనికేషన్‌శాఖ సహాయ మంత్రి దేవ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. బుధవారం మండలంలోని ముట్టెంబాక గ్రామంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో ఆయన పాల్గొన్నారు. ప్రజల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2047 నాటికి ప్రపంచ దేశాల్లో భారతదేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుందన్నారు. అనంతరం గ్యాస్ సిలిండర్ నమూనాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నల్లారెడ్డి అనిల్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీఓ గోపీనాథ్, పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోట : ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం ప్రగతి పథంలో దూసుకెళుతోందని కేంద్ర సహాయ మంత్రి దేవ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. కోట మండలం జరుగుమల్లిలో నిర్వహించంఇన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో ఆయన పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. 3,992 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు నిర్మించినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా గత తొమ్మిదేళ్లలో ఎంతో మందికి పేదరికం నుంచి విముక్తి కలిగిందని వివరించారు. ఈనెల 22వ తేదీన అయోధ్యలో శ్రీరామమందిర ప్రతిష్ఠాపనను ప్రతి ఒక్కరూ పండగలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. శ్రీరాముని అక్షింతలతోపాటు ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, నేతలు చంద్రప్ప, పురుషోత్తంరెడ్డి, రవీంద్రరెడ్డి, రమేష్‌బాబు, గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు.

పలకను సొంతం చేసుకునేందుకు పోటీ పడుతున్న యువకులు



దూసుకెళుతున్న ఎద్దు




జనం మధ్య పరుగులు తీస్తున్న కోడెగిత్త

కాలుదువ్విన కోడెగిత్తలు

చంద్రగిరి మండలం మల్లయ్యపల్లెలో బుధవారం నిర్వహించిన పరుష పందేల్లో కోడెగిత్తలు కాలుదువ్వాయి.. రంకెలేస్తూ ముందుకురికాయి.. పోటెత్తిన జనం మధ్య దూసుకెళ్లాయి.. ఈ క్రమంలో ఎడ్లను నిలువరించేందుకు యువత బరిలో దిగింది.. కొమ్ములకు కట్టిన పలకలను చేజిక్కించుకునేందుకు పోటీ పడింది.. గాయాలవుతున్నా లెక్కచేయకుండా ఎదురొడ్డి నిలబడింది.. స్థానిక వైఎస్సార్‌సీపీ నేత గురుమూర్తియాదవ్ పిలుపు మేరకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్, సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే చెవిరెడ్డి ఫొటోలు కట్టిన పలకలను దక్కించుకునేందుకు హోరాహోరీగా తలపడింది. రూ.లక్ష బహుమతిని సొంతం చేసుకునేందుకు విఫలయత్నం చేసింది. అయినప్పటికీ మల్లయ్యపల్లె పరుష పందెం ప్రజానీకానికి ఉత్సాహాన్ని పంచింది.. కనుమ పండుగ సంప్రదాయానికి గీటురాయిగా మారింది. - చంద్రగిరి

పెద్దపండుగకే తలమానికం కొండచుట్టు


గిరిప్రదక్షిణకు బయలుదేరుతున్న పులిగుంటీశ్వరుడు

పుత్తూరు: పట్టణంలో కొండచుట్టు పండుగకు పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా పూర్వ వైభవం తీసుకొచ్చారు. రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన మండపం వద్ద దశాబ్దం తర్వాత కొలువైన దేవతామూర్తులను మంత్రి రోజాతో పాటు పుత్తూరు ప్రజలు దర్శించుకున్నారు. సంక్రాంతి పండుగలో నాలుగో రోజైన బుధవారం కొండచుట్టు వైభవంగా జరిగింది. మంత్రి రోజా మాట్లాడుతూ తెలుగు ప్రజలు ఎంతో ప్రీతిపాత్రంగా జరుపుకునే పెద్ద పండుగలో చివరి ఘట్టమైన కొండచుట్టు పండుగకే తలమానికమని అన్నారు. పుత్తూరు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కొండచుట్టు మండపాన్ని రోజా చారిటబుల్ ట్రస్ట్‌చే నిర్మించడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ హరి చేసిన పండరీ భజనను ప్రజలతో కలిసి మంత్రి రోజా తిలకించడం మరో విశేషం.

కొండచుట్టు విశిష్టత

శ్రీకామాక్షి సమేత శ్రీసదాశివేశ్వరస్వామి వార్ల ఆహ్వానం మేరకు చుట్టుపక్కల గ్రామాల నుంచి దేవతామూర్తులు కొండచుట్టు మండపం వద్దకు అతిథులుగా విచ్చేయడం ఆనవాయితీ. అతిథులుగా విఘ్నేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత కృష్ణస్వామి, ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి, సీతా సమేత శ్రీరామస్వామి, ఆంజనేయస్వాముల వారు ఉన్నారు.

పరుష పందెంలో విషాదం


గురుప్రసాద్ మృతదేహం

– కోడెగిత్త కుమ్మడంతో యువకుడి మృతి

చంద్రగిరి : మండంలోని మల్లయ్యపల్లెలో బుధవారం నిర్వహించిన పరుష పందేల్లో విషాదం చోటుచేసుకుంది. కోడెగిత్త కుమ్మడంతో తిరుపతికి చెందిన గురుప్రసాద్(25) అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.